

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి బుధవారం 15-04-2026 సంపుటి: 01 సంచిక : 299 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ల హిమ పావని

Ranga Reddy Wednesday 15-04-2026 Volume :01 Issue: 299 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani





Contact Number
9059328777


## దేశానికి గాంధీ, అంబేడ్కర్

# రెండు కళ్లు


### బలమైన దేశంగా ఎదగడానికి బాబా సాహెబ్ కృషి

- తెలంగాణలో దళితులు అభ్యున్నతికి పెద్దపీట
- దళితబిడ్డలు ఉన్నత పదవుల్లో ఉంటే ఓర్వలేకపోతున్నారు
- ప్రస్తుత డీలిమిటేషన్‌తో తెలంగాణకు తీరని అన్యాయం
- అంబేడ్కర్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్ 14 నేటి దర్శిని)**

:దేశానికి గాంధీ, అంబేడ్కర్ రెండు కళ్లలాంటి వారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ పాత్ర ఎంత ఉందో.. దేశాభివృద్ధిలో అంబేడ్కర్ పాత్ర అంతే ఉందన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. ఆ ఇదకదరు మహానుభావులు దేశానికి రెండు కళ్లలాంటి వారని అన్నారు. రక్తం చిందకుండా యుద్ధం గెలవచ్చని గాంధీ నిరూపించారు.

-మిగతా 2 లో









## బీహార్ సీఎం పదవికి నితీశ్

# రాజీనామా

- కొత్త సీఎంగా బీజేపీకి చెందిన సమ్రాట్ చౌధరీ ఎంపిక
- నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న సమ్రాట్

**పాట్నా**

బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ ఎంపికయ్యారు. దాదాపు రెండు దశాబ్దాలు పాటు బిహార్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న నితీష్ కుమార్ మంగళవారం రాజీనామా చేశారు. దీంతో బిహార్‌లో అత్యున్నత పదవిని అధిరోహించనున్న తొలి బీజేపీ నేతగా సమ్రాట్ చౌధరీ నిలిచారు. బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇప్పటివరకు బిహార్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న 57 ఏళ్ల సమ్రాట్ ఓబీసీ వర్గమైన కుష్వాహా కులానికి చెందినవారు. బిహార్‌లోని ఓబీసీ కులాలలో యాదవుల తర్వాత కుష్వాహా వర్గమే అతి పెద్దది ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగిన నితీష్.. కుష్వాహా కులానికి చెందిన వ్యక్తినే తదుపరి సీఎంగా ప్రకటించాలని షరతు విధించినట్టు సమాచారం. నితీష్ సలహా మేరకే బీజేపీ.. సమ్రాట్‌కు సీఎం పీఠం అప్పగించినట్టు తెలుస్తోంది. మధ్యలో కొన్ని సంవత్సరాలు మినహా 2005 నుంచి బీజేపీ, బిహార్ ప్రభుత్వంలో మైనర్ భాగస్వామిగా ఉంటూ వచ్చింది. 20 సంవత్సరాల తర్వాత బీజేపీకి చెందిన నేత బిహార్ సీఎం అయ్యారు. 243 మంది సభ్యులున్న బిహార్ అసెంబ్లీలో నితీష్ కుమార్ పార్టీకి 85 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి 89 మంది ఉన్నారు. కాగా, బిహార్ కొత్త సీఎం అయిన సమ్రాట్ చౌధరీ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి . ఆయన మొదట ఆర్జేడీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు.

-మిగతా 2 లో



## తమిళనాడు బీజేపీ ఎన్నికల

# మేనిఫెస్టో విడుదల

- మహిళలకు ఉచిత సిలిండర్, నెలకు రూ.2,000
- చిన్న తరహా, కుటీర పరిశ్రమలకు వడ్డీ లేకుండా రూ.50,00,000 వరకు రుణాలు
- రైతులకు అదనంగా రూ.3,000 ఆర్థిక సాయం
- జల్లికట్టులో పాల్గొనే ఎద్దుల్ని పెంచేవారికి ప్రతినెలా రూ.2,000 ఆర్థిక సాయం
- జల్లికట్టులో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం


**న్యూఢిల్లీ**

తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ మేనిఫెస్టో విడుదల చేసింది. చెన్నైలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ అగ్రనేత, కేంద్ర మంత్రి జేపీ నద్దా ఈ మేనిఫెస్టో విడుదల చేశారు. మంగళవారం తమిళ నూతన సంవత్సరం కావడం విశేషం. ఈ సందర్భంగా పార్ట మేనిఫెస్టో విడుదల చేయడం మంచి పరిణామం అని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్, బీజేపీ నేతలు కే అన్నామలై, తమిళిసై సౌందరరాజన్ వంటి కీలక నేతలు పాల్గొన్నారు.ఇక, ప్రజలకు అనేక ఉచిత పథకాల్ని బీజేపీ ప్రకటించింది.

-మిగతా 2 లో

## నేడు ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల

- ఉదయం 10.31గంటలకు విడుదల
- ఈ విషయాన్ని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా వెల్లడి




**అమరావతి ఏప్రిల్ 14 నేటి దర్శిని)**

ఏపీలో ఇంటర్ ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను బుధవారం ఉదయం 10.31గంటలకు విడుదల కానున్నాయి. ఈ విషయాన్ని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఫలితాలను వెబ్‌సైట్లలోనూ పొందొచ్చు. అలాగే, మనమిత్ర ద్వారా వాట్సప్‌లోనూ (9552300009) ఈ ఫలితాలు పొందొచ్చని మంత్రి పేర్కొన్నారు. ఏపీలో ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమైన ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

-మిగతా 2 లో

## మోడీకి ట్రంప్ ఫోన్ కాల్..



2లో

## జాతీయ రహదారులపై

# ఓవర్‌లోడ్‌కు చెక్

- ఇకనుంచి భారీగా జరిమానా విధింపు
- నేటినుంచే అమల్లోకి వచ్చిన నిబంధన

2లో



## రిక్షా, ట్యాక్సీ డ్రైవర్లకు

# మరాఠీ రావాల్సిందే..



- మహారాష్ట్ర ప్రభుత్వం ఆదేశం..
- మే 1 నుంచి అమలు

**న్యూఢిల్లీ**

మాతృభాష అమలు విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై మహారాష్ట్రాలో రిక్షాలు, ట్యాక్సీలు నడిపై డ్రైవర్లకు మరాఠీ భాష రావాల్సిందే అంటూ ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఈ నిర్ణయం మాతృభాషను అమలు చేయాలనే ఆలోచనకన్నా.. ప్రయాణికులు పడుతున్న ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకుని తీసుకున్నట్లుగా కనిపిస్తోంది.

-మిగతా 2 లో

## దేశంలో అతిపెద్ద ప్రజాస్వామ్య పార్టీ

# కాంగ్రెస్

- రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రజాప్రభుత్వం
- రూ.22,500 కోట్లతో రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణం
- అభివృద్ధిని అడ్డుకుంటున్న ప్రతిపక్షాలు
- విపక్షాల తీరుపై మండిపడ్డ భట్టి విక్రమార్క

**ఖమ్మం, ఏప్రిల్ 14 నేటి దర్శిని)**

దేశంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య రాజకీయ పార్టీ కాంగ్రెస్‌లో మనమంతా పని చేయటం అదృష్టమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఈ దేశానికి కాంగ్రెస్ స్వాతంత్ర్యం తెచ్చిందని ఉద్ఘాటించారు. దేశంలో ఏ పార్టీకి ఇంతటి ఘన చరిత్ర లేదని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నూతన కమిటీ బాధ్యతల స్వీకార కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, రాందాస్ నాయక్ హాజరయ్యారు. అలాగే, అంబేడ్కర్ 135వ జయంతి

-మిగతా 2 లో





## 543 నుండి 850కి పెరగనున్న

# ఎంపీ స్థానాలు!

- పార్లమెంట్‌లో మహిళలకు 273 సీట్లు ఖాయం?
- ఏప్రిల్ 16 నుంచి ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు.
- నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రం ముసాయిదా సిద్ధం.

**న్యూఢిల్లీ ఏప్రిల్ 14 నేటి దర్శిని)**

పార్లమెంట్‌లో లోక్‌సభ సీట్ల పెంపుపై కేంద్రం తాజా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీని ప్రకారం లోక్‌సభ సీట్లు 543 నుంచి 850కి పెంచాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు తగిన డ్రాఫ్ట్ కాపీని రూపొందించిన కేంద్రం పార్లమెంట్‌లోని పార్టీలకు, ఎంపీలకు అందజేసింది. మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ, నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో మూడు రోజులపాటు ఈ సమావేశాలు జరుగుతాయి.కేంద్ర ప్రతిపాదనల ప్రకారం.. లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 543 ఎంపీ సీట్లు 850కి పెరుగుతాయి. ఇందులో రాష్ట్రాల్లో 815 స్థానాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 35 వరకు స్థానాలు పెరిగే అవకాశం ఉంది. ఇదే సమయంలో చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును కూడా

-మిగతా 2 లో

## పదేళ్ల దుర్మార్గ పాలనలో లక్షల దోపిడీ

- కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పి తీరాలి
- కెటిఆర్ పాదయాత్రలు చేసినా ప్రజలు నమ్మరు
- కాంగ్రెస్ కమిటీ బాధ్యత స్వీకారంలో పిసిసి చీఫ్



**ఖమ్మం ఏప్రిల్ 14 నేటి దర్శిని)**

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దుర్మార్గమైన పరిపాలన చేశారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. కేటీఆర్ పాదయాత్ర చేస్తానంటున్నారని.. ఆయన పాదయాత్ర కాదని.. ఏం చేసినా రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ని క్షమించరని హెచ్చరించారు. కేసీఆర్.. అప్పులు చేసి ఫాంహౌస్‌లో పడుకున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ పాదయాత్రకు ముందు మీ చెల్లి కవిత అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని

-మిగతా 2 లో

## ప్రజలను బంట్రోతుగా చూస్తున్నారా?

- లక్ష్మణ్ వలసపోయరాని విమర్శలా
- ఇందిర,రాహుల్, ప్రియాంక ఎక్కడ పోయారు
- ఉత్తరాది, దక్షిణాది అంటూ విభేదాలు సృష్టిస్తారా
- రేవంత్ వ్యాఖ్యలపై మండిపడ్డ కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీ ఏప్రిల్ 14 నేటి దర్శిని)**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి బంట్రోతు పోస్ట్ దొరకదని అంటున్నారని.. ప్రజలను బంట్రోతులుగా చూస్తున్నారా అని ఆగ్రహించారు. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభజన తీసుకొచ్చే విధంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి తప్పుడు మాటలు మాట్లాడొద్దని,

-మిగతా 2 లో



## ప్రపంచం ముందు పాక్ పరువు బజారున

- ఇరాన్-అమెరికా చర్చలు జరిగిన హోటల్ బిల్లు కూడా చెల్లించలేని పాకిస్తాన్!
- హోటల్ నోటీసులతో అసలు రంగు బయటపడింది. ట్రంప్ ప్రశంసలు కురిపించిన వేళ..
- అప్పుల ఊబిలో షెహబాజ్ ప్రభుత్వం.

2



RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక
సత్య శోధనే మా లక్ష్యం
WWW.NETIDARSHINI.COM

# బీహార్ సీఎం పదవికి నితీశ్ రాజీనామా

మొదటి తరువాయి

ఆ తర్వాత జేడీ (యు)లో చేరారు. ఆ తర్వాత బీజేపీలో చేరి కీలక నాయకుడిగా ఎదిగారు. ఈ రకంగా ఆయనకు బిహార్‌లోని మూడు ప్రధాన పార్టీల్లో పని చేసిన అనుభవం ఉంది. దాదాపు రెండు దశాబ్దాల పాటు బిహార్ ముఖ్యమంత్రిగా కొనసాగిన నితీష్ కుమార్ రాజీనామా చేశారు. పట్నాలో తన చివరి కేబినెట్ సమావేశానికి అధ్యక్షత వహించిన అనంతరం ముఖ్యమంత్రి పదవి నుంచి నితీష్ వైదొలిగారు. దీంతో తమ నాయకుడిని ఎన్నుకోవడానికి ఎన్డీయే శాసనసభ పక్షం సమావేశం అయ్యింది. కేంద్ర పరిశీలకుడిగా నియమితుడైన మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ సమావేశానికి హాజరు అయినట్లు సమాచారం.

## తమిళనాడు బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల

మొదటి తరువాయి

సంక్షేమం, అభివృద్ధి, ఆరోగ్యం వంటి అంశాల్ని దృష్టిలో పెట్టుకుని ఈ మేనిఫెస్టో రూపొందించినట్లు బీజేపీ నేతలు తెలిపారు. మేనిఫెస్టోలోని కీలక హామీలివి. మహిళలకు ప్రతి నెలా రూ.2,000 ఆర్థికసాయం, ప్రతి కుటుంబానికి ఏటా రూ.10,000 ఆర్థిక సాయం, ఉచిత గ్యాస్ సిలిండర్, జీరో ఎఫ్ఐఆర్ రిపోర్టింగ్ సిస్టమ్ అమలు, క్రూరమైన నేరాల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు, బస్సులు, స్కూళ్లు, యూనివర్సిటీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, అర్హులైన మహిళలు ఈ స్కూటర్లు కొనుక్కునేందుకు రూ.25,000 ఆర్థిక సాయం, స్వయం సహాయక గ్రూపులకు, చిన్న తరహా, కుటీర పరిశ్రమలకు వడ్డీ లేకుండా రూ.50,00,000 వరకు రుణాలు, రైతులకు అదనంగా రూ.3,000 ఆర్థిక సాయం, జల్లికట్టులో పాల్గొనే ఎద్దుల్ని పెంచేవారికి ప్రతినెలా రూ.2,000 ఆర్థిక సాయం, జల్లికట్టులో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం, మహిళల పేరు మీద ఇల్లు కొంటే మూడు శాతం తక్కువ స్టాంప్ డ్యూటీ విధింపు వంటివి ఉన్నాయి. తమిళనాడులో ఈ నెల 23 అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ 234 అసెంబ్లీ సీట్లున్నాయి. 5.67 కోట్ల మంది ఓటర్లున్నారు. 44 ఎస్సీ సీట్లు, 2 ఎస్టీ రిజర్వుడ్ సీట్లు. మే 4న ఫలితాలు వెలువడుతాయి. డీఎంకే, ఏఐఏడీఎంకే, టీవీకే, బీజేపీ, కాంగ్రెస్ ప్రధాన పార్టీలుగా పోటీ చేస్తున్నాయి.

## నేడు ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల

మొదటి తరువాయి

మార్చి 23 వరకు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా పరీక్షల నిర్వహణకు నెల సమయం పట్టింది. దీంతో మూల్యాంకనం పూర్తి కావడంలో కొంత ఆలస్యమైనప్పటికీ అనుకున్న సమయానికన్నా ముందే ఫలితాలను విడుదలకు సిద్ధం చేయడం విశేషం. ఏపీ ఇంటర్ ఫలితాలతో పాటు దీనికి సంబంధించిన అప్‌డేట్స్‌ను వెబ్‌సైట్ ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

## జాతీయ రహదారులపై ఓవర్‌లోడ్‌కు చెక్

**-ఇకనుంచి భారీగా జరిమానా విధింపు**
**-నేటినుంచే అమల్లోకి వచ్చిన నిబంధన**

న్యూఢిల్లీ



జాతీయ రహదారులపై ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలకు చెక్ పెట్టేందుకు కేంద్రం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలకు విధించే జరిమానాలను కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ సవరించింది. కొత్త నిబంధనలు ఏప్రిల్ 15 నుంచి అంటే నేటినుంచే అమల్లోకి వస్తాయి. దీని ప్రకారం.. వాహనానికి అనుమతించిన బరువు కంటే అదనంగా ఉన్న భారాన్ని బట్టి జరిమానా వసూలు చేస్తారు. ఈ మేరకు నేషనల్ హైవేస్ ఫీ ఫోర్త్ అమెండ్‌మెంట్ రూల్స్, 2026ని మోర్త్ నోట్గి÷ చేసింది. 10 శాతం వరకు ఓవర్‌లోడ్‌కు ఎటువంటి జరిమానా విధించరు. 10 నుంచి 40 శాతం వరకు ఓవర్‌లోడ్‌కు సాధారణ టోల్ రుసుము కంటే 2 రెట్లు అధికంగా రుసుము వసూలు చేస్తారు. 40 శాతం కంటే ఎక్కువ ఓవర్‌లోడ్‌తో వెళితే సాధారణ టోల్ రుసుము కంటే 4 రెట్లు అధికంగా విధిస్తారు. ఓవర్‌లోడ్‌కు విధించే జరిమానాను ఫాస్టాగ్ ద్వారానే చెల్లించాల్సి ఉంటుంది. టోల్‌ఎ÷-లాజా వద్ద బరువు కొలిచే ఏర్పాటు లేకపోతే ఎలాంటి రుసుములూ ఉండవు. రహదారుల భద్రతను పెంపొందించడం, రహదారి మౌలిక సదుపాయాలను రక్షించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

## రిక్షా, ట్యాక్సీ డ్రైవర్లకు మరాఠీ రావాల్సిందే..

మొదటి తరువాయి

మహారాష్ట్రలో మే 1 నుంచి రిక్షాలు, ట్యాక్సీలు నడిపే డ్రైవర్లకు మరాఠీ భాషపై కనీస అవగాహన ఉండాలని రాష్ట్ర మంత్రి ప్రతాప్ సర్నాయక్ తెలిపారు. ఈ అంశంపై రాష్ట్రవ్యాప్త కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. రవాణా శాఖ దీనిపై స్పెషల్ డ్రైవ్ చేపడుతుందని, ఈ మేరకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. కనీస మరాఠీ భాష మాట్లాడటం, అర్థం చేసుకోవడం రాని డ్రైవర్ల లైసెన్సులు రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు. "మే 1న మహారాష్ట్ర దినోత్సవం. ఆ రోజు నుంచి రాష్ట్రంలో లైసెన్స్ కలిగిన డ్రైవర్లకు మరాఠీ తెలిసి ఉండాలి. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు చేపడతాం. 59 ప్రాంతీయ, ఉప ప్రాంతీయ కార్యాలయ పరిధిలో రవాణా శాఖ ఆధ్వర్యంలో డ్రైవర్లు టెస్టులు పాసవ్వాలి. మరాఠీ రాయడం, చదవడం వచ్చి ఉండాలి" అని మంత్రి ప్రతాప్ సర్నాయక్ అన్నారు. డ్రైవర్లతో కమ్యూనికేషన్ సందర్భంగా ప్రయాణికుల నుంచి వచ్చిన వేలాది ఫిర్యాదుల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా ముంబై మెట్రోపాలిటన్ పరిధిలో ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రాంతీయ భాష నేర్చుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఇతర ప్రాంతాల్లో పని చేస్తున్న వారు ఆ ప్రాంతపు భాష నేర్చుకోవాలని మంత్రి సూచించారు. ప్రతి ఒక్కరూ తమ మాతృభాషపై గర్వపడాలని అభిప్రాయపడ్డారు.

## 543 నుండి 850కి పెరగనున్న ఎంపీ స్థానాలు!

మొదటి తరువాయి

పార్లమెంట్‌లో ప్రవేశపెడతారు. ప్రస్తుతం నారి శక్తి వందన్ అభినియం పేరుతో ఈ బిల్లును ప్రవేశపెట్టబోతుంది కేంద్రం. 2011 జనాభా లెక్కలకు అనుగుణంగా ప్రస్తుతానికి మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తారు. దీని ప్రకారం మహిళలకు పార్లమెంట్‌లో 273 సీట్లు వచ్చే అవకాశం ఉంది. మహిళా రిజర్వేషన్ బిల్లును, నియోజకవర్గాల పునర్విభజన బిల్లును త్వరలోనే పార్లమెంట్‌లో ఆమోదింపజేయాలని కేంద్రం లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఈ రెండింటిని 2029 లోక్‌సభ ఎన్నికల్లో అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్రం ఒక కమిటీని నిర్ణయిస్తుంది. ఈ కమిటీయే మహిళలకు సీట్లు కేటాయిస్తుంది. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలైతే పార్లమెంట్‌తోపాటు రాష్ట్రాల అసెంబ్లీల్లోనూ మహిళలకు సీట్లు పెరుగుతాయి. ఈ బిల్లులు అమలు చేయాలంటే రాజ్యాంగ సవరణ అవసరం. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 55, ఆర్టికల్ 81లను సవరించాలి. ఇది 131వ రాజ్యాంగ సవరణ అవుతుంది.

# దేశానికి గాంధీ, అంబేడ్కర్ రెండు కళ్లు

మొదటి తరువాయి

బలమైన దేశంగా భారత్ ఎదగడానికి అంబేడ్కర్ కృషి చేశారు. ప్రజల కలలు సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. అలాగే తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్రను ఎవరూ మర్చిపోలేరని సీఎం తెలిపారు. గత ప్రభుత్వ కేబినెట్‌లో దళితులకు ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ కేబినెట్‌లో దళితులకు ప్రాధాన్యం ఇచ్చామ న్నారు. దళిత బిడ్డ బడ్జెట్ ప్రవేశపెడితే చూడలేకపోతున్నారంటూ విమర్శించారు. గతంలో భట్టి విక్రమార్కకు సీఎల్పీ నేత హోదాను తొలగించేలా కుట్రలు జరిగాయని సీఎం రేవంత్ ఆరోపించారు. ఎస్సీ నాయకుడు స్పీకర్‌గా, ఆర్థిక మంత్రిగా ఉండకూడదా అని ప్రశ్నించారు. గత పదేళ్లలో ఎనాడైనా డైట్ ఛార్జీలు పెంచారా అని నిలదీశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కడితే ఓర్వలేక పోతున్నారంటూ వ్యాఖ్యానించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానంతో పిల్లల భవిష్యత్తు మారుతుందని తెలిపారు. ఇంటిగ్రేటెడ్, పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అధికారంలోకి వచ్చాక 67వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామన్నారు. 67వేల ఉద్యోగాల్లో 87శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే వచ్చాయని వెల్లడించారు. పదేళ్ల విధ్వంసం.. వందేళ్ల



నష్టానికి దారి తీసిందని సీఎం వ్యాఖ్యానించారు. ఆనాడు చేసిన అప్పులు చెల్లిస్తూ.. తప్పులు సరిదిద్దుతూ పాలన కొనసాగిస్తున్నామని వివరించారు. మహిళా రిజర్వేషన్లు, సీట్ల పెంపుపై కేంద్రం గందరగోళం సృష్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. 50 శాతం జనాభా ఆధారంగా.. మరో 50 శాతం జీఎస్‌డీపీ ఆధారంగా హైబ్రిడ్ మోడల్‌లో డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు రాజ్యసభలో ఆమోదం లభించిందని.. కానీ లోక్‌సభలో కొన్ని పార్టీలు అడ్డుకున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. సమాన అవకాశాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడపవచ్చని అంబేడ్కర్ మార్గదర్శనం చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

పేదలకు నాణ్యమైన విద్య కోసం గతంలో లేని విధంగా చర్యలు చేపట్టాం. తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానంతో పిల్లల భవిష్యత్ మారుతుంది. తెలంగాణ ఇంటిగ్రేటెడ్, పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. గతంలో చేసిన అప్పులు, తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకెళ్తున్నాం. పదేళ్ల విధ్వంసం.. వందేళ్ల నష్టానికి దారి తీసిందని సీఎం అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. ఈ బిల్లును లోక్‌సభలో కొన్ని పార్టీలు అడ్డుకున్నాయి. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నారు. దక్షిణాదిన కుటుంబ నియంత్రణ వల్ల జనాభా తగ్గి సీట్లు కోల్పోయే పరిస్థితి. కేంద్రం ఆదేశాలు పాటించి జనాభా నియంత్రణ పాటిస్తే నష్టం చేస్తున్నారు. తెలంగాణకు తీరని నష్టంపై అభ్యంతరం లేవనెత్తాం అని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# మోడీకి ట్రంప్ ఫోన్ కాల్..

**-హర్మూజ్ జలసంధి, ద్వైపాక్షిక సంబంధాలపై సంభాషణ..!**

న్యూఢిల్లీ

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను నిలువరించేందుకు మధ్యవర్థిత్వం వహించి పాకిస్థాన్ విఫలమైన వేళ.. భారత ప్రధాని నరేంద్ర మోడీ , అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఫోన్‌లో నలభై నిమిషాల పాటు సంభాషించుకున్న ఇరువురు హర్మూజ్ జలసంధి, ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సహకారం గురించి చర్చించుకున్నారు. ట్రంప్ తనకు ఫోన్ చేశారని, ఇద్దరి మధ్య ద్వైపాక్షిక అంశాలు ప్రస్తావనకు వచ్చాయని మంగళవారం ఎక్స్ వేదికగా మోడీ పంచుకున్నారు. ఇరాన్, అమెరికా మధ్య రెండో



దఫా చర్చల వార్తలు ఊపందుకున్న వేళ భారత ప్రధాని నరేంద్ర మోడీతో డొనాల్డ్ ట్రంప్ ఫోన్‌లో మాట్లాడడం ప్రాధాన్యం సంతరించుకుంది. హర్మూజ్ జలసంధి సంరక్షణ, ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పురోగతిపై మోడీ, ట్రంప్ చర్చించుకున్నారు. నా స్నేహితుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి ఫోన్ వచ్చింది. భారత్ అమెరికా మధ్య వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకారం గురించి ఇద్దరం మాట్లాడుకున్నాం. భవిష్యత్‌లో అన్ని విభాగాల్లో ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి ఇద్దరం కట్టుబడి ఉన్నాం. పశ్చిమాసియాలోని పరిస్థితులపై, హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచడం, సురక్షితంగా ఉంచడం ఎంత ముఖ్యమో కూడా చర్చించాం' అని మోడీ ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చారు.

# దేశంలో అతిపెద్ద ప్రజాస్వామ్య పార్టీ కాంగ్రెస్

మొదటి తరువాయి

సందర్భంగా ఖమ్మం నగరంలోని జడ్పీ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి భట్టి విక్రమార్క, మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీగా కాంగ్రెస్ కార్యాయలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. నేడు దేశాన్ని ఏలుతున్న బీజేపీ కూడా కాంగ్రెస్ తర్వాతే వచ్చిందని భట్టి విక్రమార్క ప్రస్తావించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేస్తోంటే రైతులకు ఆ మేలు జరగకూడదని ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. రూ.22,500 కోట్లతో రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణం చేపట్టామని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆగ్రహించారు. పేదలకు ఇళ్లు దక్కకూడదనే లక్ష్యంతో ప్రతిపక్షాల నేతలు దుర్మార్గమైన మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ బలోపేతానికి అందరం ఐక్యంగా కృషిచేద్దామని భట్టి విక్రమార్క సూచించారు. మహిళలకు రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని వెల్లడించారు. కాంగ్రెస్‌పై ప్రతిపక్షాల నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గత పదేళ్లు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీని కాపాడుకునేందుకు ప్రాణాలు పణంగా పెట్టి పోరాడారని ప్రశంసించారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేద్దామని సూచించారు. పార్టీకోసం కష్టపడిన వాళ్లకి తప్పకుండా గుర్తింపు దక్కుతుందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# పదేళ్ల దుర్మార్గ పాలనలో లక్షల దోపిడీ

మొదటి తరువాయి

సవాల్ విసిరారు. ఈ మేరకు మాజీ మంత్రి కేటీఆర్‌పై మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్ల కేసీఆర్ హయాంలో ఏం చేశారని.. ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క లెక్కలతో సమాధానాలు అడుగుతుంటే కేసీఆర్ అండ్ కో సతమతమవు తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేత సంతోశ్‌రావు ఎలా సంతోషంగా ఉన్నారో.. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆనందం ఏంటో మీ దోపిడీ ఎంతో.. మీ చెల్లెలు కవిత చెబుతోందని సెటైర్లు గుప్పించారు. పదేళ్లు దోపిడీకి అలవాటు పడి నేడు పదవులు కోల్పోయి ప్రజల ఆగ్రహానికి గురై నేడు విలవిలలాడుతున్నారని విమర్శించారు. కేటీఆర్ అండ్ కో పిచ్చిమాటలు మాట్లాడుతూ అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నూతన కమిటీ బాధ్యతల స్వీకారం కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, రాందాస్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రపంచంలోనే ఎక్కడ లేని విధంగా ఈ దేశంలో ప్రధాన పాత్ర పోషిస్తోందని చెప్పుకొచ్చారు. ఖమ్మం జిల్లా.. కాంగ్రెస్‌కి ఎప్పుడూ అండగా నిలిచిందని ఉద్ఘాటించారు. బ్లాక్ కాంగ్రెస్ కార్యకర్తగా ఉన్న పీవీ నరసింహ రావు దేశ ప్రధాని అయ్యారని ప్రస్తావించారు. ఇది ఒక్క కాంగ్రెస్‌కే సాధ్యమని తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం కావాలని మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతో నేడు తెలంగాణలో అధికారంలోకి వచ్చామని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని సమూలంగా వారికి నచ్చినట్లుగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తుంటే.. కాంగ్రెస్ అడ్డుకుందని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాట ఫలితంగా కులగణన చేశారని ప్రస్తావించారు. కాంగ్రెస్‌లో సామాన్య కార్యకర్తలు కీలక పదవులు పొందారని అన్నారు. భట్టివిక్రమార్క చేసిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయిందని ఉద్ఘాటించారు. ఖమ్మం గడ్డపై నిలబడి చెబుతున్నా.. వచ్చే ఎన్నిక కాదని.. ఆ తర్వాత వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. చేతనైతే తమ విజయాన్ని అడ్డుకోవాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని తాము నెరవేరుస్తున్నామని తెలిపారు. ఖమ్మం నుంచే కాంగ్రెస్ విజయం ప్రారంభమైందని చెప్పుకొచ్చారు. పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరినీ గుర్తిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## ప్రపంచం ముందు పాక్ పరువు బజారున

**-ఇరాన్-అమెరికా చర్చలు జరిగిన హోటల్ బిల్లు కూడా చెల్లించలేని పాకిస్తాన్!**
**-హోటల్ నోటీసులతో అసలు రంగు బయటపడింది.**
**-ట్రంప్ ప్రశంసలు కురిపించిన వేళ.. అప్పుల ఊబిలో షెహబాజ్ ప్రభుత్వం.**

న్యూఢిల్లీ



ఇరాన్-అమెరికా మధ్య శాంతి చర్చలకు వేదికగా నిలిచి, ప్రపంచం ముందు గొప్పలు పోతున్న పాకిస్తాన్ అసలు వ్యవహారం ఇప్పుడు బయటపడింది. రెండు దేశాల మధ్య చర్చలకు వేదికైన ఇస్లామాబాద్‌లోని హోటల్ బిల్లు కూడా చెల్లించలేక ప్రపంచం ముందు అవమానం పాలైంది. ఇరాన్-అమెరికా మధ్య పాకిస్తాన్ వేదికగా ఇటీవల శాంతి చర్చలు జరిగాయి. ఏప్రిల్ 10-12 వరకు ఇస్లామాబాద్‌లోని హోటల్ సెరెనా వేదికగా శాంతి చర్చలు జరిగాయి. దీనికి ఇరు దేశాలకు చెందిన అగ్రనేతలు హాజరయ్యారు. వీరికి పాక్ ప్రభుత్వం ఆతిథ్యం ఇచ్చింది. అంటే, ఇక్కడి ఆతిథ్య ఖర్చుల్ని పాక్ భరించాలి. ఇక.. ఈ చర్చలు విఫలమైన సంగతి కూడా తెలిసిందే. ఈ చర్చలు నిర్వహించడం ద్వారా ప్రపంచం ముందు తాము ఈ ప్రాంతంలో మధ్యవర్తిత్వం వహించగల సత్తా ఉన్న దేశంగా చాటింపు చేసుకుంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా పాకిస్తాన్‌ను పొగిడాడు. పాక్ ప్రధాని షెహబాజ్, సైన్యాధ్యక్షుడు అసిమ్ మునీర్‌పై ప్రశంసలు కురిపించారు. ఇంతఖ్యాతి పొందిన పాకిస్తాన్ ఇప్పుడు ఇదే విషయంలో ప్రపంచం ముందు అభాసుపాలైంది.

## ప్రజలను బంట్రోతుగా చూస్తున్నారా?

మొదటి తరువాయి

వాస్తవాలు మాట్లాడాలని సూచించారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు వ్యతిరేకంగా ఉన్నాయని అన్నారు. రేవంత్ రెడ్డి వితండవాదలు పక్కన పెట్టాలని కిషన్ రెడ్డి హితవు పలికారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ వ్యతిరేకంగా పుట్టిన పార్టీ టీడీపీ అని తెలిపారు. తెలుగువారి ఆత్మగౌరవంగా టీడీపీ పుట్టిందని ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఇద్దరు ఉపరాష్ట్రపతులుగా ఉన్నారని ప్రస్తావించారు. వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతిగా పని చేశారని, తాను ఒక్కడినే మేధావిని అనుకుని అద్దాల మేడలో కూర్చుని సీఎం రేవంత్ రెడ్డి రాళ్లు వేయడం మంచిది కాదని హితవు పలికారు. ఇందిరా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ ఎక్కడి నుంచి వచ్చారని ప్రశ్నించారు. దేశం మొత్తం ఒకటి కాదా అని ప్రశ్నించారు. లక్ష్మణ్ వలస పోయారని రేవంత్ రెడ్డి అంటున్నారని.. మరి ఇందిరాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ ఎక్కడి నుంచి పోటీ చేశారని కిషన్ రెడ్డి నిలదీశారు. కాంగ్రెస్‌ను రాహుల్ గాంధీ బుద్ధితో నడిపిస్తే, రేవంత్ రెడ్డి డబ్బులతో నడిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌కి అధికారికంగా కోశాధికారిగా పని చేస్తున్నారని సెటైర్లు గుప్పించారు. డీలిమిటేషన్‌తో ఎన్ని సీట్లు పెరుగుతాయనేది పార్లమెంట్ సమావేశాల్లో తెలుస్తోందని చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి హైబ్రిడ్, జీడీపీ పరంగా సీట్లు పెరగాలని అంటున్నారని, ప్రపంచలో ఇది ఎక్కడ లేదని అన్నారు.

# బాలికలు విద్యతోపాటు ఆర్థిక స్వావలంబన సాధించాలి: ఎంపీ డాక్టర్ కడియం కావ్య

- విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ




**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్14(నేటి దర్శిని బ్యూరో):** అంబేద్కర్ ఆశయాల సాధనతోనే సమాజంలో నిజమైన సమానత్వం సాధ్యమని, మహిళల ఆర్థిక సాధికారత దేశ అభివృద్ధికి మూలస్తంభమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. వరంగల్ నగరంలోని లష్కర్ బజార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ వార్షికోత్సవ వేడుకలకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 10వ తరగతి ప్రతిభావంతులైన విద్యార్థులకు, సామాజిక వేత్తలకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ బాలికలు విద్యతో పాటు ఆర్థికంగా స్వావలంబన సాధించాల్సిన అవసరం ఉందని, మహిళ బలపడితేనే కుటుంబం, సమాజం, దేశం బలపడుతుందని స్పష్టం చేశారు. మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను సమర్థంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవలను స్మరించుకున్న ఎంపీ డా.కడియం కావ్య సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలను దేశానికి అందించిన మహనీయుడని కొనియాడారు. ఒకప్పుడు మాత్రమే ఉన్న అంబేద్కర్ విగ్రహాలు నేడు దేశవ్యాప్తంగా గౌరవ స్థానం పొందడం ఆయన ఆలోచనల ప్రభావాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. ఇక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని తీవ్రంగా విమర్శించారు. దేశంలో మనువాద భావజాలాన్ని ప్రోత్సహిస్తూ సామాజిక విభజనకు దారి తీస్తోందని ఆరోపించారు. ఎస్సీ వర్గాల హక్కులను పరిమితం చేసే చర్యలు తీసుకుంటూ, మత స్వేచ్ఛపై కూడా ఆంక్షలు విధించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎస్సీలు మత మార్పిడి చేసుకుంటే హక్కులను కుదించే విధానాలు అమలు చేయడం రాజ్యాంగానికి విరుద్ధమని అన్నారు. కేంద్ర బీజేపీ మళ్లీ ఎస్సిలను వెలివాడలకు నెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే మహిళా బిల్లులపై స్పష్టత లేకుండా కేంద్రం వ్యవహరిస్తోందని, మహిళల హక్కుల విషయంలో గందరగోళం సృష్టిస్తోందని విమర్శించారు. ట్రాన్స్‌జెండర్ హక్కుల విషయంలో కూడా వివక్షత చూపుతూ, వ్యక్తిగత గుర్తింపును అంగీకరించని విధానాలను తీసుకువస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాక రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కూడా పరిమితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని, సమాజ సేవా భావనను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్య ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా పాశంవారిగూడెంలో అంబేద్కర్ జయంతి వేడుకలు



**గుర్రంపోడ్,ఏప్రిల్ 14 (నేటి దర్శిని):** గుర్రంపోడ్ మండలం పాశంవారిగూడెం గ్రామపంచాయతీ ఆవరణంలో రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను, సమాజంలో సమానత్వం కోసం చేసిన పోరాటాన్ని గుర్తుచేసుకుంటూ ప్రసంగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు ఎ. స్వరణ్, కె. లింగారెడ్డి, పి. గోవర్ధన్ రెడ్డి, ఆశా వర్కర్ పి. శ్రీలత, గ్రామపంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# న్యాయ్ భోజ్-సహా పంక్తి భోజనం నిర్వహించిన డిసిసి అధ్యక్షులు, కూడా చైర్మన్ వెంకటరామిరెడ్డి



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 14 (నేటి దర్శిని బ్యూరో):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని ఉమ్మడి వరంగల్ జిల్లా హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామంలో "న్యాయ్ భోజ్–సహా పంక్తి భోజనం" కార్యక్రమం టీపీసీసీ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు , వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నేతృత్వంలో కార్యక్రమ నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ పింగిలి వెంకట్రామ్ నరసింహ రెడ్డి అనుబంధ సంఘాల నాయకులు, నాయకురాలులతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. దేశ పౌరులందరికీ సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగ పీఠికను అందరూ కలిసి సామూహికంగా పఠించి, రాజ్యాంగ రక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కుల, మత, వర్గ విభేదాలను పక్కన పెట్టి, అందరూ ఒకే పంక్తిలో కూర్చుని భోజనం చేసి 'సమానత్వ' సందేశాన్ని చాటిచెప్పారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూఅంబేద్కర్ కేవలం ఒక వర్గానికి చెందిన వారు కాదని, ఆయన ఈ దేశ సంపద అని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉంటుందన్నారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా చేపట్టిన 'న్యాయ్' యాత్ర స్ఫూర్తితోనే మంగళవారం ఈ 'న్యాయ్ భోజ్' నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ అనుబంధ సంఘాల చైర్మన్లు, కుల సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అన్ని వర్గాలకు చెందిన మహానుభావుడు: ఎంపీ డాక్టర్ కడియం కావ్య

- కేంద్ర బీజేపీ అంబేద్కర్‌ను ఒక వర్గానికి పరిమితం చేసే కుట్రలు చేస్తోంది
- బిల్లులోని అంశాలను ఎంపీలకు తెలియజేయకుండా ముందుకు సాగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం
- అంబేద్కర్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మన అందరిపై ఉంది



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 14 (నేటి దర్శిని బ్యూరో):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అన్ని వర్గాలకు చెందిన మహానుభావుడని దేశంలోని అన్ని కులాలు మతాలు వర్గాలకు సమానాక్కులు కల్పించండి ఆయన కృషి చేశారని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలందరికీ అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు తెలియజేసారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మీడియాతో మాట్లాడుతూ కేంద్ర బీజేపీ అంబేద్కర్‌ను ఒక వర్గానికి పరిమితం చేసే ప్రయత్నం చేస్తుందని ఎంపీ విమర్శించారు. ఇటువంటి చర్యలు సమాజంలో విభజనకు దారితీస్తాయని హెచ్చరించారు. రానున్న 16, 17, 18 తేదీల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న మహిళా బిల్లుపై కేంద్ర ప్రభుత్వం పారదర్శకత పాటించడం లేదని ఎంపీ డా.కడియం కావ్య ఆరోపించారు. బిల్లులోని అంశాలపై ఎంపీలకు పూర్తి సమాచారం ఇవ్వకుండా ముందుకు సాగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాలు, కులాల పేరుతో ప్రజలను విభజించి పాలించాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధానం డాక్టర్ అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధమని అన్నారు. అంబేద్కర్ వారసులుగా ఆయన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందని ఎంపీ పిలుపునిచ్చారు. ఎలాంటి కుట్రలు జరిగినా వాటిని నమ్మకుండా "మానవత్వమే మన మతం" అనే భావంతో ముందుకు సాగాలని కోరారు. అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టాల్ ను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీ డా.కడియం కావ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా అంబేద్కర్, పూలే జయంతి వేడుక

- అణగారిన వర్గాల ఆశాజ్యోతులు పూలే, అంబేద్కర్
- అంబేద్కర్, పూలే ఆశయ సాధనలో ఐక్యంగా కదులుదాం
- దేవరకొండలో అంబరాన్నంటిన జయంతి ఉత్సవాలు






**దేవరకొండ, ఏప్రిల్ 14 ( నేటి దర్శిని):** భారత రాజ్యాంగ నిర్మాత, నవభారత భాగ్యవిధాత విశ్వరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి మరియు సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలను మంగళవారం దేవరకొండ నియోజకవర్గ కేంద్రంలో మాల మహానాడు నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం నుండి ప్రారంభమైన భారీ ర్యాలీ పురవీధుల గుండా ఉత్సాహంగా సాగింది, అనంతరం సాయిశివ గార్డెన్స్‌లో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ సభలో బహుజన మేధావి డాక్టర్ యేకుల రాజారావు, డివిజన్ అధ్యక్షులు యేకుల సురేష్, నియోజకవర్గ అధ్యక్షులు బోయిని చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి మేడ సైదులు ప్రసంగిస్తూ పూలే మరియు అంబేద్కర్ చేసిన సామాజిక పోరాటాలను గుర్తు చేసుకున్నారు. అక్షర విప్లవానికి నాంది పలికిన పూలే మరియు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్ ఆశయాలే నేడు మనకు మార్గదర్శకమని, వారు కల్పించిన హక్కుల వల్లనే అణగారిన వర్గాలకు నేడు సామాజిక గౌరవం దక్కుతోందని వక్తలు కొనియాడారు. ఈ ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి ఎన్నికైన నూతన సర్పంచులు, ఉప సర్పంచులు మరియు వార్డు సభ్యులను కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించి వారి సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ ఉపాధ్యక్షులు కోరెక్క చెన్నయ్య, దేవరకొండ మండల అధ్యక్షులు బత్తుల దినకర్, విజిలెన్స్ జిల్లా కమిటీ సభ్యులు యేకుల అనిత సురేష్, లాయర్ నూనె సురేష్, ఎంప్లాయిస్ నాయకులు చేపూరి కృపయ్య, కోరే పురుషోత్తం, సల్వాది పెద్దులు, చేపూరి శ్రీను, పెరుమాళ్ల హరి, చేపూరి, చెన్నయ్య, జ్యోతి, యేకుల సుధాకర్, యాదయ్య, బత్తుల రత్నం, బాలనారయ్య , కొండమల్లేపల్లి మండల అధ్యక్షులు అన్నిమళ్ల సురేష్, చందంపేట మండల అధ్యక్షులు అంజనేలు నేరేడుగొమ్ము అధ్యక్షులు వాసు మరియు నాయకులు పెరుమాళ్ల అనిల్, గోరటి మల్లేష్, యేకుల అంబేద్కర్, నాగటి హరీష్, కోరే ప్రభాకర్, కాలే వెంకటయ్య, నియోజకవర్గ స్థాయి వివిధ అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ మరియు మైనారిటీ వర్గాలకు చెందిన మేధావులు, విద్యార్థులు, ఉద్యోగులు మరియు జర్నలిస్టుల భాగస్వామ్యంతో ఈ ఉత్సవాలు దేవరకొండలో విజయవంతంగా ముగిశాయి.

# రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించిన జిల్లా కలెక్టర్



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 14(నేటి దర్శిని బ్యూరో):** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని రోడ్డు భద్రతపై అధికారుల, ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత పై అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం ఉందని ,ప్రభుత్వము లేదా పోలీస్ శాఖ బాధ్యత అని, కాకుండా ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. తొలుత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎస్పి శుభం ప్రకాష్, వివిధ శాఖల అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు యువకులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## యుద్ధోన్మాద మత్తు దిగితేనే.... ప్రపంచశాంతి !



నోబెల్ శాంతి బహుమతి కావాలని కోరుకుంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్..యుద్ధోన్మాదిగా మారాడు. ఆయనకు తోడుగా ఇజ్రాయల్ ప్రధాని బెంజ్‌మెన్ న ఎతన్యాహు తోడయ్యారు. వీరిద్దరు కలసి ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తున్న తీరుతో ప్రపంచ దేశాలు దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. ఓ రకంగా చెప్పాలంటే అమెరికా ఎంతగా నష్టపోయినా సరే ట్రంప్ మాత్రం యుద్ధాన్ని వీడేది లేదన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. చర్చలు విఫలం అయితే దానికి ఎక్కువ బాధ్యత అమెరికాదే. ఎందుకంటే యుద్ధం మొదలు పెట్టిందే వారు. ఇప్పుడు దానికి అణుబూచి రంగు పులిమి ఇరాన్‌ను దెబ్బతీయాలని చూడడం సరికాదు. నిజానికి ప్రపంచదేశాలు ట్రంప్ తీరుపై గళమెత్తాలి. కానీ ఏ దేశం కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. భారత్ కూడా మాటకూడా మాట్లాడడం లేదు. ఎందుకంటే ఇప్పుడు యుద్ధం ముగించకుంటే చమురు మంటలు అన్ని దేశాలను దహించి వేస్తాయి. దీంతో సామాన్య ప్రజలు అల్లాడుతారు. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమవడంతో పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారాయి. పాకిస్థాన్ వేదికగా జరిగిన ఈ చర్చలు దాదాపు కొలిక్కి వచ్చినట్లే కన్పించినా.. చివరి నిమిషంలో వీటికి బ్రేక్ పడింది. ఇందుకు కారణం అణు కార్యకలాపాల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడమేనని తాజాగా తెలిసింది. 20 ఏళ్ల పాటు యురేనియం శుద్ధి నిలిపివేయాలని అమెరికా ప్రతిపాదన పెట్టగా, అందుకు ఇరాన్ నిరాకరించినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. యురేనియం శుద్ధిని ఐదేళ్ల పాటు మాత్రమే నిలిపివేస్తామని టెహ్రాన్ చెప్పినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ఇందుకు అగ్రరాజ్యం సమ్మతించకపోవడంతోనే చర్చలు ఆగిపోయినట్లు తెలిపాయి. వాస్తవానికి టెహ్రాన్ శాశ్వతంగా యురేనియం శుద్ధిని నిలిపివేయాలని ట్రంప్ యంత్రాంగం ముందునుంచీ డిమాండ్ చేసింది. కానీ చర్చల సమయంలో దాన్ని 20 ఏళ్లకు తగ్గించడం గమనార్హం. అయితే ఈ పీటముడి ఇలాగే ఉంటుందా...అమెరికా మళ్లీ యుద్ధానికి కాలుదువ్వుతుందా అన్న ఆందోళన ప్రపంచ దేశాలను కలచివేస్తోంది. 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత అమెరికా-ఇరాన్ మధ్య ఈ స్థాయిలో అత్యున్నత స్థాయి సమావేశం జరగడం మళ్లీ ఇప్పుడే. ఇస్లామాబాద్‌లో జరిగిన ఈ భేటీలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ సహా ఇరుదేశాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దాదాపు 20 గంటల పాటు ఈ చర్చలు సాగాయి. 80శాతం అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరింది. ఒప్పందం దాదాపు కుదిరినట్లుగానే కన్పించింది. కానీ, కాసేపటికే అవి విఫలమయ్యాయని పాక్ ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అయితే, ఈ చర్చలు పూర్తిగా నిలిచిపోలేదని, రెండోదశ ముఖాముఖి భేటీకి ఇరుదేశాలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అటు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఇదే విషయాన్ని సూచనప్రాయంగా వెల్లడించారు. డీల్ కుదుర్చుకునేందుకు తాము సుముఖంగానే ఉన్నామని ఇరాన్ తమతో చెప్పినట్లు తెలిపారు. ఈ చర్చలు సాఫీగా సాగేలా పట్టువిడుపులు ఉండాల్సిందే. దెబ్బతిన్న ఇరాన్ పునరుద్దరణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. ఎందుకంటే చమురు సంక్షోభంముదరకుండా చూసుకోవాలి. ఇప్పటికే బ్యారెట్ ధర 113 డాలర్లకు చేరింది. ఇది ఆయా దేశాలపై మోయలేని భారం చూపనుంది. అందుకే పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రపంచం ఇంధన సంక్షోభంలో చిక్కుకుపోయింది దాంతో రానున్న వారాల్లో చమురు ధరలు గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని అమెరికా ఇంధన శాఖ మంత్రి క్రిస్‌రైట్ కూడా హెచ్చరించారు. ర్మూజ్‌లో నౌకల రాకపోకలు మొదలైనా.. రవాణా మునుపటి స్థాయికి చేరేవరకు ఈ మోత ఉంటుందని హెచ్చరించారు. ర్మూజ్ లో నౌకల రాకపోకలు గణనీయస్థాయిలో పెరిగే వరకు ఇంధన ధరల అధికంగా ఉండొచ్చు. పెరుగుతూనే ఉండొచ్చు .కూడా ము÷ఎద్ధం ముగిస్తే తప్ప చమురు ధరలు తగ్గొచ్చని అందరూ అంచనా వేస్తున్నారు. ఇక నవంబర్‌లో జరగనున్న మిడ్‌టర్మ్ ఎన్నికల వరకు ఇంధన ధరలు ఎక్కువగానే ఉండొచ్చని ఇటీవల అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా సూచనప్రాయంగా వెల్లడించారు. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో మార్చి నెలలో గల్ఫ్ దేశాల నుంచి చమురు ఉత్పత్తి భారీగా తగ్గిందని ఒపెక్ విడుదల చేసిన డేటా ప్రకారం వెల్లడవుతోంది. ఇరాక్‌లో దాదాపు 61శాతం మేర ఉత్పత్తి తగ్గింది. ఫిబ్రవరిలో రోజుకు 4.2 మిలియన్ బ్యారెళ్ల నుంచి మార్చిలో రోజుకు 1.6 మిలియన్ బ్యారెళ్లకు పడిపోయింది. కువైట్‌లో 53శాతం, యూఏఈలో 44 శాతం, సౌదీ అరేబియా 23 శాతం ఉత్పత్తి తగ్గిపోయింది. ఇక చమురు సరఫరాలో కీలకమైన పైప్‌లైన్ ఇరాన్ దాడుల్లో దెబ్బతినడంతో రోజూవారీ 7 మిలియన్ల బ్యారెళ్ల నుంచి 7 లక్షల బ్యారెళ్లకు పడిపోయిందని సౌదీ మీడియా వెల్లడించింది. మొత్తంగా ఒపెక్ దేశాలు చేసే ఉత్పత్తి 27 శాతం మేర కుంగింది. ఇదిలాఉంటే.. ర్మూజ్ జలసంధిని దిగ్బంధించాలన్న అగ్రరాజ్యం అమెరికా నిర్ణయాన్ని చైనా తీవ్రంగా తప్పుబట్టింది. జలసంధిలో తమ నౌకల కార్యకలాపాలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. అందుకు తగ్గట్టే ట్రంప్ హెచ్చరికలను పట్టించుకోకుండా.. అమెరికా ఆంక్షలున్న చైనా ట్యాంకర్ హర్మ్యూజ్‌ను దాటింది. మరిప్పుడు దీనిపై యూఎస్ నౌకాదళం ఎలా స్పందిస్తుందో తెలియాల్సి ఉంది. మొత్తంగా ఈ దోబూచులాట ఆగాలి. చమురు దేశాలు స్వేచ్ఛగా వాణిజ్యం చేసుకునే స్థితి రావాలి. అప్పుడే ప్రపంచంలో శాంతి వస్తుంది. ట్రంప్ కూడా మూర్ఖంగా ముందుకు వెళ్లకుండా ప్రపంచశాంతికి కట్టుబడి ఉండాలి.

# సమానత్వ సమాజ నిర్మాణం అవసరం





**నేటి దర్శిని డెస్క్**

భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా పలు ప్రాంతాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించబడినాయి. ఈ సందర్భంగా సామాజిక సమానత్వం, కులవ్యవస్థ నిర్మూలన, రాజ్యాంగ విలువల పరిరక్షణపై పలువురు నాయకులు, మేధావులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, కుల పునాదులపై సమాజాన్ని నిర్మించడం సాధ్యం కాదని, కులవివక్ష సమాజంలో అసమానతలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. మానవత్వం, నైతిక విలువలు పుట్టుకతో కాకుండా వ్యక్తి ప్రవర్తనతో నిర్ణయించబడతాయని స్పష్టం చేశారు. కుల వ్యవస్థ వల్ల దేశం అనేక ప్రతిభావంతులను కోల్పోతుందని, సామాజిక చైతన్యం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు.నేటి సమాజంలో కూడా కుల వివక్ష కొనసాగుతుండటం బాధాకరమని, విద్యాసంస్థలు సహా పలు రంగాల్లో అసమానతలు పెరుగుతున్నాయని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తుచేశారు. ముఖ్యంగా అణగారిన వర్గాలు విద్యను సాధనంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు.కులవివక్షను కేవలం చట్టాలతోనే కాకుండా సామాజిక చైతన్యం, విద్య, సాంస్కృతిక మార్పుల ద్వారా నిర్మూలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. యువత సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని, కుల, మత విద్వేషాలకు దూరంగా ఉండాలని సూచించారు. అంబేద్కర్ ఆశయాల సాధన కోసం సమాజంలోని అన్ని వర్గాలు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పాల్గొన్నవారు పేర్కొన్నారు.

# నోయిడా హింస వెనుక భారీ కుట్ర

- పోలీసులపై దాడికి ప్లాన్..
- పాక్ హస్తంపై అనుమానాలు



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 14 నేటి దర్శిని)**

వేతనాల పెంపు కోరుతూ ఉత్తర ప్రదేశ్‌లోని నోయిడాలో కార్మికులు చేపట్టిన నిరసనలు సోమవారం హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. అయితే, ఈ ఘటనల వెనుక భారీ కుట్ర, ప్లానింగ్ ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అంతేకాదు.. దీని వెనుక పాకిస్తాన్ హస్తం కూడా ఉండొచ్చనే కోణంలో విచారణ జరుపుతున్నారు. కార్మికుల ఆందోళనలు హింసాత్మకంగా మారడం వెనుకు పాకిస్తాన్ కుట్ర ఉండొచ్చని యూపీ కార్మిక శాఖ మంత్రి అనిల్ రాజ్‌బహర్ అన్నారు. ఈ ఘటనల్ని ప్రణాళికాబద్ధంగా జరిగిన కుట్రగా ఆయన అభివర్ణించారు.ఈ విషయాన్ని పోలీసులు తెలుస్తారని చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగించేందుకే ఈ ఘటనలు జరిగాయని అనుమానం వ్యక్తం చేశారు. ఇటీవల నోయిడాలోని మీరట్ ప్రాంతంలో నలుగురు ఉగ్రవాదులు అరెస్టైన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. మరోవైపు ఈ ఘటనపై పోలీసులు లోతైన దర్యాప్తు జరుపుతున్నారు. ఈ విచారణలో సంచలన విషయాలు బయటపడుతున్నట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. ఈ హింస వెనుక భారీ కుట్ర, ప్లానింగ్ ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. ముందుగా కొందరు కార్మికులు వారం రోజుల క్రితం.. ఫ్యాక్టరీల్లో వేతనాల పెంపు కోరుతూ నిరసన చేపట్టారు. తర్వాత ఈ నిరసనలు వీధుల్లోకి మారాయి. వేల మంది కార్మికులు నిరసనల్లో చేరారు. తర్వాత మరింత ఆందోళనకరంగా మారాయి. పోలీసులపైకి రాళ్లు రువ్వడం, ప్రైవేటు ఆస్తులు ధ్వంసం చేయడం, ఫ్యాక్టరీల్ని ధ్వంసం చేయడం, వాహనాల దహనం వంటి ఘటనలు జరిగాయి. అయితే, ఈ ఘటనలు ఉన్నట్లుండి జరిగినవి కావని, వీటి వెనుక భారీ కుట్ర ఉందని పోలీసులు తేల్చారు. ఆందోళనకారులు ఈ ఘటనలకు మూడు రోజుల ముందు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని చాటింగ్, ఆడియో కాల్స్ చేసుకున్నట్లు గుర్తించారు. అందరినీ సమీకరించడం, నిరసనలు తెలపడం వంటి వాటిపై చర్చించుకున్నారు. ఈ డిజిటల్ ఎవిడెన్స్‌ను ఫోరెన్సిక్ బృందం పరిశీలిస్తోంది. అలాగే, ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా చాటింగ్ చేసుకున్నట్లు గుర్తించారు. అందులో ఏకంగా మరుసటి రోజు పోలీసులపై ఎలా దాడి చేయాలో కూడా చర్చించారు. పోలీసులపై దాడి చేసేందుకు కారం కూడా తీసుకురావాలని చర్చించుకున్నారు. పోలీసుల దాడుల్లో తమవాళ్లు గాయపడ్డారని, అందుకు బదులుగా మరిన్ని నిరసనలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ దాడుల్లో కొందరు మాస్కులు ధరించి పాల్గొనడం కూడా చర్చనీయాంశంగా మారింది. వారిని గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కార్మికులతో సంబంధం లేని వారు ఈ ఘటనల్లో పాల్గొన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలకు సంబంధించి ఇప్పటివరకు పోలీసులు దాదాపు 400 మందిని అరెస్టు చేశారు. 7 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

# ఎన్నికల తర్వాతపెట్రో వాత?

- లీటర్ పెట్రోల్‌పై రూ.18, డీజిల్‌పై 35
- నష్టాలను భరిస్తున్న చమురు కంపెనీలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 నేటి దర్శిని)**

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత పెట్రో ధరలు భారీగా పెరిగే అవకాశం ఉన్నది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ రంగ చమురు సంస్థలు హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐవోసీలు లీటర్ పెట్రోల్‌పై రూ.18, డీజిల్‌పై రూ.35 నష్టాలను భరిస్తున్నాయి. ఇప్పటికిప్పుడు చమురు ధరలు పెంచితే అవి అసెంబ్లీ ఎన్నికలు జరిగే పశ్చిమ బెంగాల్, ఇతర రాష్ట్రాలపై ప్రతికూల ప్రభావం పడనున్నందున వాటి ఎన్నికలు ముగిసిన వెంటనే కేంద్రం పెట్రో ధరలను భారీగా పెంచే అవకాశం ఉంది.చమురు ధరలు భారీగా పెరగడంతో దేశంలోని మూడు ప్రధాన ఆయిల్ కంపెనీలు రోజుకు రూ.2,400 కోట్ల నష్టాన్ని ఎదుర్కోనుండగా, ఎక్సైజ్ సుంకాన్ని రూ.10 తగ్గించడంతో ఈ నష్టం రూ.1,600 కోట్లకు చేరుకుంది. అంతర్జాతీయంగా ప్రతి 10 డాలర్ల పెరుగుదలకు మనపై లీటర్‌కు రూ.6 భారం పడుతుంది. కాగా, 2022 ఆగస్టు తర్వాత తొలిసారిగా అమెరికా సగటున ప్రతి గ్యాలన్ పెట్రోల్‌కు 4 డాలర్లు పెంచింది.

# అంబేడ్కర్‌కు మోడీ నివాళులు

- దేశ నిర్మాణాంలో అంబేడ్కర్ కృషి అపూర్వమని వెల్లడి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 నేటి దర్శిని)**

డాక్టర్ భీమ్ రావ్ రాంజీ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు. దేశ నిర్మాణంలో అంబేద్కర్ కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

న్యాయబద్ధమైన, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించేందుకు బాబాసాహెబ్ జీవితం, కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తున్నాయని ప్రశంసించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు. దేశ నిర్మాణ దిశగా ఆయన చేసిన కృషి ఎంతో స్ఫూర్తిదాయకం. ఒక న్యాయబద్ధమైన, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించేందుకు ఆయన జీవితం, కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి' అని ట్వీట్ చేశారు.మరోవైపు అంబేద్కర్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, తెలంగాణ సిఎం రేవంత్,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహా వివిధ రాష్ట్రా ప్రముఖ నేతలు నివాళులు అర్పించారు. దేశం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అలాగే అంబేద్కర్ వాదులు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయన్ని గుర్తు చేసుకుంటున్నారు

# ఘనంగా జరిపిన బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు....

● ముఖ్యఅతిథిగా కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి.....



**ఆమనగల్లు,ఏప్రిల్14(నేటి దర్శిని ప్రతినిధి):** ఆమనగల్లు పట్టణంలో రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరయ్యి స్థానిక నాయకులతో, అధికారులతో, కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. జయంతి సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలను తెలియజేశారు. సమానత్వం, స్వేచ్ఛ,సౌభ్రాతృత్వం, అని మహత్తర విలువలను మన రాజ్యాంగం ద్వారా అందించిన మహనీయుడని ఆయన కొనియాడారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చూపిన మార్గం సమాజానికి ఎల్లప్పుడూ దిశ నిర్దేశం చేస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. అంబేద్కర్ గారి ఆశయాలకు అనుగుణంగా అందరికీ సమాన అవకాశాలు కల్పించే సమాజ నిర్మాణం కోసం మనమంతా కట్టుబడి పని చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం సమానత్వం కోసం అంబేద్కర్ గారి స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుసుమ మాధురి, మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్, ఏఎంసీ చైర్మన్ యాట గీత,ఆమనగల్ మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు,మండల పార్టీ అధ్యక్షులు జగన్,10వ వార్డ్ కౌన్సిలర్ కోగురి అనిత శ్రీనివాస్ రెడ్డి,అవ్వారి శివలింగం,ఎంగలి ప్రసాద్, గాజుల శ్రీను,కృష్ణా నాయక్, మహేష్,ఎండి అబ్దుల్ రహీం,కరీం,మెకానిక్ బాబా,మానయ్య, కాలె మల్లయ్య,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,ముఖ్య నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు

● ముఖ్య అతిథిగా పాల్గొన్న బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి




**మిడ్జిల్, ఏప్రిల్ 14, (నేటి దర్శిని ప్రతినిధి):** ఉర్కొండ మండలంలోని రాశీరెడ్డి పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ ఓర్సు అలివేల ఆంజనేయులు వారి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర నాయకులు నాగర్ కర్నూల్ జిల్లా కరాటే కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ముచ్చర్ల జనార్దన్ రెడ్డి హాజరు కావడం జరిగింది. అంబేద్కర్ యువజన సంఘం నాయకులు జగన్ ఆధ్వర్యంలో యువకులంతా ఘనంగా స్వాగతం పలుకుతూ రామిరెడ్డిపల్లి గ్రామంలో ఊరేగింపుగా ప్రారంభం చేస్తూ అంబేద్కర్ విగ్రహనీకి పూల మాలలు వేస్తూ అక్కడే ఏర్పాటుచేసిన సమావేశంలో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని మాట్లాడడం జరిగింది, ఈ సందర్భంగా దేశంలో వివక్షా కు మరియు అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన పోరాటం ఈ చరిత్రలో మరువలేనిది అదేవిధంగా ఈ భారత దేశంలో ఉన్న ప్రతి ఒక్క పౌరుడు ఆయన కల్పించినటువంటి హక్కుల ద్వారానే మనం కూడా కొనసాగిస్తున్నారని మహనీయుని అడుగుజాడలో ప్రతి ఒక్కరు కూడా నడుచుకోవాలని ఆయన పోరాటస్ఫూర్తిని ప్రతి ఒక్క మానవుడు కూడా గుర్తించుకోవాలని చెప్పేసి మాట్లాడడం జరిగింది, ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి కిరణ్, వార్డు మెంబర్లు కొమ్ము మలయ నాగనీల జంగయ్య అనిల్ శ్రీనివాస్ యాదవ్ హరికిషన్ వెంకటేష్ చారి ప్రశాంత్ శ్రీకాంత్ పవన్ సురేష్ పరూషారములు మహిళలు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు గ్రామ యువకులు, పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది

# అంబేద్కర్ ఆశయాలే నిజమైన నివాళులు

● బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి



**చైతన్యపురి, ఏప్రిల్ 14 (నేటి దర్శిని):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి 135వ జయంతి సందర్భంగా చైతన్యపురి డివిజన్‌లోని మారుతీనగర్, మున్సిపల్ కాలనీ, అంబేద్కర్ నగర్ కాలనీలలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, అంబేద్కర్ గారి జీవితం సమాజంలో సమానత్వం నెలకొల్పడానికి అంకితం అయిందని పేర్కొన్నారు. కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతూ ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించాలనే దృఢ సంకల్పంతో ఆయన పనిచేశారని అన్నారు. ప్రతి పౌరునికి ఓటు హక్కు కల్పించడం ద్వారా గౌరవప్రదమైన జీవితం సాధ్యమవుతుందనే మహత్తర సందేశాన్ని అంబేద్కర్ గారు అందించారని తెలిపారు. ఆయన ఆశయాలను ఆచరిస్తేనే నిజమైన నివాళి అర్పించినట్టవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తోట మహేష్ యాదవ్, శివప్రకాశ్, శంకర్, జలంధర్, వీరబాబు, మహేష్, ఉపేందర్, వెంకన్న, నరేష్, రామస్వామి, వెంకటేశ్వర్లు, ముతయ్య, మల్సూర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత సమాజంలోని ప్రతి వ్యక్తి బాధ్యత: ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు

● ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా అనేక కుటుంబాలను ప్రమాదాల నుంచి కాపాడవచ్చు
● అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 14 (నేటి దర్శిని బ్యూరో):** రోడ్డు భద్రత కేవలం ప్రభుత్వ లేదా పోలీస్ శాఖ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి వ్యక్తి బాధ్యత అని, ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా అనేక కుటుంబాలను, ప్రమాదాలనుంచి కాపాడవచ్చునని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం హన్మకొండ అంబేద్కర్ సెంటర్ వద్ద వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని రోడ్డు భద్రతకు సంబంధించిన పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రజల జీవన భద్రత కోసం ఇలాంటి అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృత స్థాయిలో నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.అనంతరం ప్రజా పతినిధులు, పార్టీ నాయకులు ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకుల చేత పోలీస్ అధికారులు రోడ్డు భద్రతపై తమ బాధ్యత గురించి, నిబంధనలు పాటిస్తూ ముందుకు వెళ్తామని వారి చేత ప్రమాణం చేయించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు అధికంగా మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. వాహనదారులు వేగ పరిమితిని పాటించడం, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ వినియోగించాలని ఆయన గట్టిగా సూచించారు.అలాగే యువతలో ట్రాఫిక్ నియమాలపై మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని, విద్యాసంస్థల స్థాయిలోనే రోడ్డు భద్రతపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. ప్రతి పౌరుడు వ్యక్తిగత భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా బాధ్యతగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అరైవ్- అలైవ్ అనే సందేశం ప్రతి ఒక్కరి జీవన విధానంలో భాగం కావాలని ఆయన అన్నారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణ నష్టానికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీస్ ఉన్నతాధికారులు మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనల అమలులో ప్రజల సహకారం అత్యంత అవసరమని, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలను తగ్గించేందుకు నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఉన్నతాధికారులు, అధికారులు, పోలీస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, యువజన సంఘాలు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు , పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# దేవరకొండలో ఘనంగా బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలు





● అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్
● AISSD నాలుగో ముద్రణ పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బాలునాయక్

**దేవరకొండ, ఏప్రిల్ 14 (నేటి దర్శిని ):** ఈ శతాబ్దపు మహా మేధావి, కోట్లాది బ్రతుకుల్లో భరోసా నింపిన అన్నార్తుల ఆశాదీపం, భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి 135వ జయంతి ఉత్సవాలను మంగళవారం దేవరకొండ పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన అధికారిక కార్యక్రమానికి దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ ముఖ్య అతిథిగా హాజరై, బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఎమ్మెల్యే బాలు నాయక్ గారు మాట్లాడుతూ.. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే మహత్తర విలువలను మన రాజ్యాంగం ద్వారా అందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన చూపిన మార్గం సమాజానికి ఎల్లప్పుడూ దిశానిర్దేశం చేస్తుందని, సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ గారి స్ఫూర్తితోనే ప్రస్తుత ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని పునరుద్ఘాటించారు. నియోజకవర్గ ప్రజలందరికీ ఆయన అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ (AISSD) జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు మద్దిమడుగు బిక్షపతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో AISSD నాలుగో ముద్రణ పుస్తకాన్ని ఎమ్మెల్యే బాలు నాయక్, ఆర్డీఓ రమణారెడ్డి, ఏఎస్పీ శ్రీనివాసరావు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇలాంటి ప్రచురణలు యువతలో సామాజిక చైతన్యాన్ని నింపుతాయని, అంబేద్కర్ ఆశయ సాధనలో AISSD చేస్తున్న కృషీ కొనియాడారు.ఈ ఉత్సవాల్లో ఆర్డీఓ రమణారెడ్డి, ఏఎస్పీ శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ యేకుల అనిత సురేష్, బహుజన మేధావి యేకుల రాజారావు, స్థానిక సీఐ, ఎస్సైలు, ఏఎస్డబ్ల్యూఓ, మరియు పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. అదేవిధంగా ISSD జిల్లా ఉపాధ్యక్షులు యేకుల సురేష్ బర్పటి వెంకటయ్య,, జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్యాల గోపాల్, సహాయ కార్యదర్శి ధర్మపురి శీను కీలక పాత్ర పోషించారు. వీరితో పాటు పి.ఏ.పల్లి మండల అధ్యక్షుడు వద్దిపట్ల లక్ష్మయ్య, చందంపేట మండల అధ్యక్షుడు నంది వెంకటయ్య, బార్పటి శ్రీరాజు, దున్న గణేష్, శేఖర్, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు మరియు ప్రజలు భారీ ఎత్తున పాల్గొని బాబాసాహెబ్‌కు నివాళు లు అర్పించారు.

# ఇంటర్ లో రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించిన విద్యార్థిని మౌనిక ను సన్మానించిన

● మాజీ మంత్రి వర్యులు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి

**మిడ్జిల్, ఏప్రిల్ 14, (నేటి దర్శిని ప్రతినిధి):** కావెరమ్మపేట మైనారిటీ గురుకుల కళాశాలలో చదువుతున్న మిడ్జిల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన దీ=హా సీనియర్ నాయకులు బొంకురు జంగయ్య పార్వతమ్మ గార్ల కుమార్తె మౌనిక ఇంటర్ మొదటి సంవత్సరంలో 440 మార్కులకుగాను 438 సాధించి స్టేట్ ర్యాంక్ సాధించిన మౌనిక ను వారి తల్లిదండ్రులనుసన్మానించిన మాజీ మంత్రి వర్యులు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ బడుగు బలహీన వర్గాల విద్యార్థుల చదువుల కోసం ప్రవేశపెట్టిన మైనారిటీ గురుకుల ఫలితాలు అద్భుతంగా ఉన్నాయని అన్నారు.విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తల్లిదండ్రులు మిపైన పెట్టుకున్న ఆశలను నిజం చేయాలని అన్నారు. ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని అన్నారు ఈ కార్యక్రమంలో



వివిధ గ్రామాల సర్పంచ్ లు మండలమాజీ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# మిడ్జిల్ మండలంలో ఘనంగా 135వ అంబేద్కర్ జయంతి వేడుకలు


చిల్వేర్ గ్రామపంచాయతీ


మున్ననూర్ గ్రామపంచాయతీలో


వాడియాల గ్రామపంచాయతీలో


మిడ్జిల్ గ్రామపంచాయతీలో


పెద్ద గుండ్ల తండా గ్రామపంచాయతీలో

**మిడ్జిల్,ఏప్రిల్ 14:** మిడ్జిల్ మండలంలోని అన్ని గ్రామాల ప్రాంతంలో నిర్వహించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో భాగంగా మండలంలోని అన్ని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామ సర్పంచులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి, పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ..భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి సేవలు దేశానికి అపారమని కొనియాడారు. సమానత్వం, సామాజిక న్యాయం, స్వేచ్ఛ వంటి మహత్తర విలువలను ఆయన జీవితాంతం ఆచరించి ప్రజలకు మార్గదర్శకుడిగా నిలిచారని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాల సాధన ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# సంగెం గ్రామానికి గర్వకారణం బిందుశ్రీ అద్భుత విజయం

- 500లో 485 మార్కులు -కాలేజ్ టాపర్‌గా బిందుశ్రీ కీర్తి
- ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో టాప్ -కష్టానికి ఫలితం
- కాలేజ్ టాపర్ గా మంచి ఫలితాలు సాధించిన బిందుకు ఘనంగా సన్మానించిన గ్రామ సర్పంచ్ మరియు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు



**కేశంపేట 14 ఏప్రిల్ నేటి దర్శిని ప్రతినిధి** మహబూబ్‌నగర్ గర్ల్స్ జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ మీా కోర్సులో సంగెం గ్రామానికి చెందిన కూడలి బిందుశ్రీ 500 మార్కులకు గాను 485 మార్కులు సాధించి కాలేజ్ టాపర్‌గా నిలిచి ప్రతిభ కనబరిచింది. ఆమె సాధించిన ఈ అద్భుత ఫలితంపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షులు సంగెం ఇబ్రహీం, గ్రామ సర్పంచ్ వేణుగోపాల్ చారి, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు బిందుశ్రీని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పట్టుదలతో చదివితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. బిందుశ్రీ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. బిందుశ్రీ మాట్లాడుతూ తన విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహమే కారణమని, భవిష్యత్తులో మరింత కృషి చేసి ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతానని తెలిపింది.

# పోలీస్ ప్రధాన కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలు








**మిడ్జిల్, ఏప్రిల్ 14, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ శాసనసభ సభ్యుడు ఎం.శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీమతి కుష్బూ గుప్తా ఐఏఎస్ , అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుమ్మాల మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, డిటిఓ రఘు కుమార్, టౌన్ ఇన్స్పెక్టర్ అజాజుద్దీన్ తదితరులు పాల్గొని అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘన నివాళులు అర్పించారు. ప్రజా ప్రతినిధులు, పోలీస్ అధికారులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా Arrive Alive నినాదంతో అధికారులు మరియు ప్రజల చేత రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేయించబడింది. తదుపరి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అంబేద్కర్ గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడుతూ, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి దిశానిర్దేశం చేసే సమగ్ర రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయుడు అంబేద్కర్ గారు అని తెలిపారు. ఆయన రూపొందించిన రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం మరియు ప్రాథమిక హక్కులు లభించాయని వివరించారు. అంబేద్కర్ అణగారిన వర్గాల అభ్యున్నతికి, సామాజిక సమానత్వం సాధనకు, మహిళల సాధికారతకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడని, సమసమాజ స్థాపన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన విశ్వమానవుడని ఎస్పీ అభివర్ణించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు వినియోగించుకోవడంతో పాటు వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత కూడా మనందరిపై ఉందని ఎస్పీ పేర్కొన్నారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ రాజ్యాంగబద్ధంగా నడుచుకుంటూ "చట్టం ముందు అందరూ సమానమే" అనే సూత్రాన్ని కచ్చితంగా పాటించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు నిబద్ధతతో, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, ప్రజలకు చేరువై వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసినప్పుడే అంబేద్కర్ గారి ఆశయాలను సాకారం చేసినట్లవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డి.సి.ఆర్.బి డిఎస్పి రమణా రెడ్డి, ఎస్ బి ఇన్స్పెక్టర్ మోతిరాం, ఆర్.ఐ లు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్, ఆర్ఎస్ఐలు మరియు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని బాబాసాహెబ్ అంబేద్కర్ గారికి ఘన నివాళులు అర్పించారు.

# అంబేద్కర్ ఆశయ సాధనకు కట్టుబడి ముందుకు సాగాలి: జక్కిడి రఘువీర్ రెడ్డి



**ఎల్బీనగర్; ఏప్రిల్ 14 (నేటి దర్శిని):** సామాజిక న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేసిన భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎల్బీనగర్ పరిధిలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మన్సూరాబాద్ మరియు లెక్చరర్స్ కాలనీ డివిజన్‌లలో ఏర్పాటు చేసిన వేడుకలలో ప్రముఖ నాయకుడు జక్కిడి రఘువీర్ రెడ్డి పాల్గొని, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమాజంలోని అణగారిన వర్గాల హక్కుల కోసం అహర్నిశలు పోరాడిన మహానుభావుడు అంబేద్కర్ అని పేర్కొన్నారు. విద్యను ఆయుధంగా తీసుకుని సమానత్వం సాధించాలనే ఆయన సంకల్పం దేశానికి మార్గదర్శకమైందని అన్నారు. దళితుల సాధికారత, మహిళల హక్కులు, సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ చేసిన కృషి అపారమని కొనియాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ప్రవేశపెట్టిన 'దళిత బంధు' పథకం ద్వారా దళితులకు ఆర్థికంగా ప్రోత్సాహం లభించిందని, అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాన్ని నిర్వీర్యం చేసి వారికి అన్యాయం చేసిందని విమర్శించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినప్పటికీ, దానికి గౌరవప్రదంగా నివాళులు అర్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

# డా. బాబాసాహెబ్ అంబేద్కర్‌కు జక్కిడి ప్రభాకర్ రెడ్డి ఘన నివాళి



**ఎల్బీనగర్; ఏప్రిల్ 14 (నేటి దర్శిని):** భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీ పీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి వివిధ ప్రాంతాల్లో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి స్మరించుకున్నారు..హయత్‌నగర్, మన్సూరాబాద్, నాగోల్ డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఎల్బీనగర్ మహనీయుల విగ్రహాల కూడలి, హయత్‌నగర్ బస్ స్టాప్ సమీపం, నాగోల్ డివిజన్-58 సర్వే నెంబర్ ప్రాంతాల్లో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు సమర్పించారు. అలాగే మన్సూరాబాద్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు..ఈ సందర్భంగా జక్కిడి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, "డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారు చూపిన మార్గం సమాజానికి వెలుగుదారి. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు అపారమైనవి. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలి. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా సమాన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు జక్కిడి సత్యతేజ రెడ్డి సహా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అణగారిన వర్గాలకు ఆత్మగౌరవం ఇచ్చిన అంబేద్కర్...






- మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్
- కొత్తూరు,తిమ్మాపూర్ లో విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన లావణ్య దేవేందర్ యాదవ్

**హాజరైన వైస్ చైర్మన్,కౌన్సిలర్లు**

**కొత్తూర్ ఏప్రిల్ 14 (నేటి దర్శిని ప్రతినిధి)** స్వేచ్ఛ స్వాతంత్రం అందించిన మహనీయుడు డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ అని మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అన్నారు. మంగళవారం కొత్తూరు మున్సిపాలిటీ,వై జంక్షన్, తిమ్మాపూర్ లో అంబేద్కర్ విగ్రహానికి మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ హాజరై పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ద్వారా అందరికీ సమాన హక్కులు కల్పిస్తూ, స్వేచ్ఛ స్వాతంత్రం అందించిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అన్నారు. ప్రతి ఒక్కరు ఆయన సూచించిన మార్గంలో నడవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్



డోలి రవీందర్,కౌన్సిలర్స్ చంద్రకళ రాజేందర్ గౌడ్,కోస్గి శ్రీనివాస్, సోమ్లా నాయక్,బ్యాగరీ ప్రసన్న లత యాదయ్య,మాజీ సర్పంచ్ ఏనుగు జనార్దన్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ జంగ గళ్ళ కృష్ణయ్య,బిఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగ గళ్ళ శివకుమార్,నాయకులు కర్రోల్ల లక్ష్మయ్య,సిటీ కేబుల్ వెంకటేష్, రవి నాయక్,శ్రీను చారి,భాస్కర్ గౌడ్,యాదయ్య,నరసింహ,జంగ గళ్ళ ప్రవీణ్,పాశం గణేష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సమానత్వానికి ప్రతీక అంబేద్కర్‌కు ఘనంగా నివాళులర్పించిన ఉప్పల శ్రీనివాస్ గుప్త



**ఎల్బీనగర్, ఏప్రిల్ 14 (నేటి దర్శిని):**
భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి 135వ జయంతి సందర్భంగా ఎల్బీనగర్ రింగ్ రోడ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ, సమానత్వం, సామాజిక న్యాయం అనే మహోన్నత లక్ష్యాలతో భారత రాజ్యాంగాన్ని రూపకల్పన చేసిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని, వాటిని సాధించడం మనందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎడల రమేష్, జీడి నరసింహ, మాదిగ జేఏసీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నక్క మహేష్, గిరిజన మహాశక్తి రాష్ట్ర అధ్యక్షుడు చందర్ నాయక్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ర్యాంకర్ మౌనికకు ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అభినందనలు

- కష్టపడి చదివితే ప్రభుత్వ విద్యాసంస్థల నుంచే గొప్ప విజయాలు సాధ్యం: ఎమ్మెల్యే



**జడ్చర్ల, ఏప్రిల్ 14, (నేటి దర్శిని ప్రతినిధి):**
ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన మిడ్జిల్ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని మౌనికను జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి సన్మానించి అభినందించారు.
ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 440లో 438 మార్కులు సాధించి స్టేట్ ర్యాంకర్‌గా నిలిచిన మౌనిక, జడ్చర్ల మున్సిపాలిటీలోని కావేరమ్మపేట మైనార్టీ గురుకుల కళాశాలలో విద్యను అభ్యసించడం గర్వకారణమని ఎమ్మెల్యే పేర్కొన్నారు

## గ్రామీణ యువతలో నైపుణ్యాభివృద్ధికి ఉచిత శిక్షణలు అభినందనీయం

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**కురుమిద్దలో శిక్షణ పొందిన యువతకు సర్టిఫికెట్‌ల ప్రదానోత్సవం**







**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 14 (నేటి దర్శిని):**
యాచారం మండలం కురుమిద్ద గ్రామంలోని యంబి కర్మెల్ ప్రార్థనా మందిరంలో గత మూడు సంవత్సరాలుగా యువతీ యువకులకు ఉచితంగా అందిస్తున్న స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తి కావడంతో మంగళవారం సర్టిఫికెట్‌ల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్ రెడ్డి రంగారెడ్డి శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంగ్లీష్ మరియు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని, ఈ శిక్షణతో యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. ప్రతి గ్రామంలో ఇలాంటి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు కావాలని ఆకాంక్షిస్తూ, ప్రభుత్వ పరంగా అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. శిక్షణ పొందిన యువత తమ జీవితాల్లో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఉచిత కంప్యూటర్ శిక్షణలు భవిష్యత్తులో మరిన్ని నిర్వహించాలని సూచించారు. అనంతరం చర్చి పాస్టర్, సంఘస్తులను ఎమ్మెల్యే అభినందించారు. అంతకుముందు అంబేద్కర్ జయంతి సందర్భంగా డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యాచారం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ నీలం శ్రీవిద్య శ్రీరాములు, ఏసిపి కేవీపీ రాజు, సీనియర్ పాస్టర్ రెవరెండ్ జి.డేవిడ్ రాజ్, పాస్టర్ కె.దినాకర్, పాస్టర్ కె.రవీందర్, మాజీ ఉపసర్పంచ్ గోపాలి జోసెఫ్, సంఘం సీనియర్ సభ్యులు కల్లేపల్లి సోమలింగం, పి.పౌలు, జి.లక్ష్మయ్య, జి.రవికుమార్, ఎం.రామచంద్రి, కె.మహేందర్, కె. జాన్, బి.శ్యామ్, పి. రమేష్, టి.కిరణ్, జి.దేవదాస్, జి.కిరణ్, జి.మహేందర్, పి.గణేష్, పి.రమేష్, ఎం.మహేందర్, కె.లాజర్, కె.కృష్ణ, గ్రామ పాలకవర్గ సభ్యులు, సంఘస్తులు, గ్రామ ప్రజలు

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు











- అంబేద్కర్ సంఘం అధ్యక్షులు బలిగెల దేవయ్య

**మిడ్జిల్, ఏప్రిల్ 14, (నేటి దర్శిని ప్రతినిధి):**
మిడ్జిల్ మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్లో భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మంగళవారం అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు దేవయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ కుల మత వర్గ భేదాలు లేకుండా సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్య స్వాభిమానం, హక్కుల సాధనలో అంబేద్కర్ ఆలోచనలు నేటికీ మారదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాల సాధన కోసం యువత ముందుకు రావాలని సామాజిక న్యాయం కోసం పోరాటం కొనసాగించాలని వారు సూచించారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. అనంతరం సాయంత్రం వేళలో అంబేద్కర్ చిత్రపటాన్ని భారీగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శంకర్ ముదిరాజ్,ఉపసర్పంచ్ మమత,అంబేద్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షులు వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ గౌస్, ఎస్సై శివ నాగేశ్వర నాయుడు,నాయకులు సంపత్ కుమార్, బాలయ్య, రవీంద్ర, దేవరాజ్, యాదయ్య, బుచ్చయ్య, వ్యాపార సంఘం అధ్యక్షులు గంజి కృష్ణ, బిజెపి నాయకులు తిరుపతి, నరేష్ నాయక్ దళిత సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల హామీల అమలుకు మౌన ర్యాలీ

- దివ్యాంగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి: జేఏసీ డిమాండ్



**హైదరాబాద్, ఏప్రిల్ 14 (నేటి దర్శిని):**
కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో అమలు సాధన సమితి ఆధ్వర్యంలో దివ్యాంగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేస్తూ మౌన నిరసన ర్యాలీ నిర్వహించారు. మలక్‌పేట్‌లోని దివ్యాంగుల కార్యాలయం నుండి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించేందుకు ప్రయత్నించిన జేఏసీ నాయకులను పోలీసులు అడ్డుకుని గృహనిర్బంధం, అరెస్టులకు పాల్పడ్డారు. అయితే ఈ చర్యలను లెక్కచేయకుండా జేఏసీ నాయకులు లూయీ బ్రెయిలీ పార్క్ నుండి ముషారంబాగ్ అంబేద్కర్ విగ్రహం వరకు పోలీస్ బందోబస్తులో ర్యాలీగా వెళ్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి వినతిపత్రం సమర్పించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ, మార్చి 24న అసెంబ్లీ ముట్టడి, మార్చి 25న ఇంద్రపార్క్ ధర్నా చౌక్ వద్ద రిలే నిరాహార దీక్షలు నిర్వహించినప్పటికీ ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తయ్యినా దివ్యాంగుల సమస్యలపై ఒక్కరోజు కూడా చర్చించలేదని విమర్శించారు.
ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**ప్రధాన డిమాండ్లు:**
-వికలాంగుల హక్కుల చట్టం-2016ను పటిష్టంగా అమలు చేయాలి
-అన్ని ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం కల్పించాలి
-వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా ఏర్పాటు చేయాలి
-బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలి
-వికలాంగుల పెన్షన్‌ను రూ.6,000కు, తీవ్ర వైకల్యంతో ఉన్న వారికి రూ.15,000కు పెంచాలి
-స్థానిక సంస్థల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి
-దివ్యాంగుల కోసం ప్రత్యేక విశ్వవిద్యాలయం, మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేయాలి. ఈ కార్యక్రమంలో చెరుకు నాగభూషణం, ముదిగొండ నరసింహ గౌడ్, వంశరాజ్ రామచంద్ర, మహమ్మద్ మున్నా, మారవేణి చంద్రశేఖర్ యాదవ్, పిండి నర్సింహ, మొక్క ఉపేందర్, షేక్ నయీమ్, శ్రీశైలం యాదవ్, శివ యాదవ్, భద్రయ్య యాదవ్, ఆంజనేయులు గౌడ్, వేణు గౌడ్, దానమ్మ, మాధవి, సైదులు శ్రీనివాస్ తదితర దివ్యాంగుల సంఘాల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాలకు సమానత్వం కల్పించిన మహనీయులు అంబేద్కర్



**మందమర్రి ఏప్రిల్ 14 (నేటి దర్శిని):**
భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న,బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఒక కులానికి నాయకుడు కాదని, అన్ని వర్గాల వారికి సమానత్వం కల్పించిన గొప్ప మహనీయుడు అని ప్రముఖ పారిశ్రామికవేత్త, చదరంగం రాష్ట్ర అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు,రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకుడు ఎంపీ సిరాజ్ ఉర్ రెహమాన్ తెలిపారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని రామన్ కాలనీలో అంబేద్కర్ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా పంచశీల జెండాను ఆవిష్కరించి, అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సిరాజ్ ఉర్ రెహమాన్ మాట్లాడుతూ, మహిళల హక్కుల కోసం, సమాన హక్కుల కోసం పోరాడిన గొప్ప సాంఘికవేత్త, మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ప్రతి ఒక్కరు ఆయన ఆశయాలకు అనుగుణంగా ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సేన నాయకులు తుంగపిండి రాజేష్ కుమార్ మాట్లా డుతూ, వచ్చే ఏడాది నాటికి రామన్ కాలనీ ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకా వెంకటస్వామి శ్రమశక్తి అవార్డు గ్రహీత తుంగపిండి రాంచందర్, దళిత రత్న తుంగపిండి రాజేష్ కుమార్, అంబేద్కర్ సేన జిల్లా అధ్యక్షుడు రమేష్,నాయకులు ఈగ కనకయ్య, కొలిపాక సాంబయ్య, మేకల శంకర్, రాము,అక్రమ్ సతీష్, బెక్కం నరేష్,గడ్డం శ్రీనివాస్,ఎమ్మార్పీఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కన్నూరి కృష్ణ లు పాల్గొన్నారు.

# హయత్‌నగర్‌లో అంబేద్కర్ ఘనంగా జయంతి వేడుకలు

- అంబేద్కర్ ఆశయాలే సమాజానికి దిక్సూచి: కల్లెం నవజీవన్ రెడ్డి

**హయత్‌నగర్; ఏప్రిల్ 14 (నేటి దర్శిని):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి జయంతి సందర్భంగా హయత్‌నగర్ పరిధిలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హయత్‌నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హయత్‌నగర్ జాతీయ రహదారి పై ఉన్న అంబేద్కర్ విగ్రహంతో పాటు, అనుమగల్ హయత్‌నగర్, తొర్రూర్ రోడ్ పెద్దమ్మ గుడి సమీపంలోని విగ్రహాలకు పూలమాలలు సమర్పించి గౌరవ నివాళులు అర్పించారు. అదేవిధంగా అంబేద్కర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్



అంబేద్కర్ విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమంలో

కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ, "డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చూపిన మార్గం సమాజానికి వెలుగుదారి. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి అపారమైనది. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలి. అంబేద్కర్ గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా సమాన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు పారంద మహేష్, సీనియర్ నాయకులు సంఘీ అశోక్, జంజ్య నాయక్, సురేష్ రెడ్డి, బాలు నాయక్, శక్తి సింగ్, డివిజన్ ఎస్సీ మోర్చా అధ్యక్షులు ఎర్ర శ్రీనివాస్, బీజేవైఎం సీనియర్ నాయకులు ఎర్ర ప్రేమ్, బీజేవైఎం అధ్యక్షులు అఖిలేష్, బీజేవైఎం నాయకులు అభిలాష్, ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ వీధుల్లో నీలి ప్రవాహం

- అడుగడుగునా అంబేద్కర్ స్మరణతో హోరెత్తిన ట్రైసిటీ
- ఆకాశమంత నీలి రంగు.. సముద్రమంత జన ప్రవాహం
- గుండె లోతుల్లోంచి ఉవ్వెత్తున ఎగసిపడుతున్న జై భీమ్ నినాదాలు
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నిర్వహించిన విజ్ఞాన జ్యోతి యాత్ర లో పాల్గొన్న యువత



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 14(నేటి దర్శిని బ్యూరో):** భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు నేతృత్వంలో నిర్వహించిన వాక్ ఫర్ ఈక్వాలిటీ కేవలం ఒక ర్యాలీలా కాకుండా, ఒక చైతన్య వెల్లువలా సాగింది. హసన్‌పర్తి నుంచి మొదలైన వేలాది బైక్‌ల ర్యాలీ నగరాన్ని చుట్టేసింది. గాలిలో రెపరెపలాడుతున్న నీలి జెండాలు, బైక్ హారన్ల మధ్య వరంగల్ జిల్లా అర్బన్ జిల్లా యూత్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ ఆధ్వర్యంలో 500 పైగా బైక్ బైక్ ల తో యువత ఉత్సాహం చూస్తుంటే జన సంద్రోహంగా మారింది. కె.యు. క్రాస్ వరకు సాగుతున్న ఈ ప్రదర్శనలో ప్రతి ఒక్కరూ ఒకే నినాదంతో కదం తొక్కారు. కనివినీ ఎరుగని సమానత్వపు నడక కేంద్ర ప్రభుత్వం దళితలపై బహుజనులపై చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టేవిధంగా ఎమ్మెల్యే నాగరాజు వినూత్నంగా ఆలోచించి వాక్ ఫర్ ఈక్వాలిటి అనే మహోత్తరా కార్యక్రమనికి పునాది వేశారు. ప్రస్తుతం ఉప్పెనలా సాగుతున్న ఈ ర్యాలీని చూసేందుకు రెండు కళ్లు సరిపోవడం లేదు ఎటు చూసినా నీలి రంగు తో బ్లూ ఆర్మీ అద్భుతమైన ర్యాలీని నిర్వహించారు. కాకతీయ యూనివర్సిటీ క్రాస్ నుంచి కలెక్టరేట్ వరకు సాగుతున్న పాదయాత్ర సుమారు 4,000 మందికి పైగా అశేష జనవాహిని రోడ్లపైకి రావడంతో వరంగల్ రాజవీధులు నీలి సముద్రాన్ని తలపించాయి. చిన్న పెద్ద ముసలి ముతక, ఉత్సాహంతో ఊగిపోతున్న యువత, ఇలా ప్రతి ఒక్కరూ ఆ దూరాన్ని సైతం లెక్కచేయకుండా అడుగులో అడుగు వేస్తూ ముందుకు సాగుతున్నారు. డప్పు దరువులు, ఆటపాటలు, అంబేద్కర్ గొప్పతనాన్ని చాటిచెప్పే గీతాలతో వాతావరణం భక్తిపారవశ్యంతో నిండిపోయింది. ఎమ్మెల్యే నాగరాజు అడుగులో అడుగు వేస్తూ ప్రజా ప్రతినిధి అనే గర్వం లేకుండా, సామాన్య అంబేద్కర్ అభిమానిగా ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు జనంతో కలిసి నడవడం ఈ ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆయన పిలుపుతో కదిలివచ్చిన ఈ జనసందోహం చూస్తుంటే, వరంగల్ గడ్డపై అంబేద్కర్ సిద్ధాంతాలు బలంగా పాతుకుపోనున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం రాష్ట్ర లైబ్రరీ చైర్మన్ మహమ్మద్ రియాజ్, యువకులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదుల పేరుతో బిల్డర్ల కొత్త మోసం?

- ఆర్థిక బలంతో అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న బిల్డర్స్ అసోసియేషన్..
- బిల్డర్స్ అసోసియేషన్ పేరిట నిబంధనల ఉల్లంఘన ఆరోపణలు
- ఫిర్యాదు చేసిన వారిపై బెదిరింపులు, తప్పుడు కేసుల ఆరోపణ
- జీ ప్లస్ టూ అనుమతితో అదనపు అంతస్తులు నిర్మాణం
- జిహెచ్ఎంసి నోటీసులు, సీజ్ చేసినా నిర్మాణం కొనసాగింపు
- బిల్డర్లు చేసే అక్రమ నిర్మాణాలపై పూర్తిస్థాయిలో విచారణ చేయించాలి...
- సికింద్రాబాద్ జోన్ డిసిపి కి దళిత చైతన్య సంఘం ఫిర్యాదు



**సికింద్రాబాద్, ఏప్రిల్ 14 (నేటి దర్శిని):** సికింద్రాబాద్‌లో బిల్డర్లు జిహెచ్ఎంసి నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో బిల్డర్స్ అసోసియేషన్ పేరిట కొంతమంది నిర్మాణదారులు అధికారులను తప్పుదోవ పట్టిస్తూ, అక్రమాలకు పాల్పడుతున్నారని దళిత చైతన్య సంఘం ఆరోపించింది. సోమవారం దళిత చైతన్య సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ తన బృందంతో కలిసి సికింద్రాబాద్ జోన్ డీసీపీని కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిహెచ్ఎంసి నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రత్యేకంగా సికింద్రాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామ్ సుందర్ ఆర్ట్స్ కాలేజ్ రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్‌కు ఆనుకుని భారీ అక్రమ నిర్మాణం చేపట్టినట్లు ఆరోపించారు. జీ ప్లస్ టూ అనుమతి తీసుకుని అదనంగా సెల్లార్ తవ్వడం, మూడు అంతస్తులు అదనంగా నిర్మించడం వంటి చర్యలు చట్ట విరుద్ధమని తెలిపారు. ఇప్పటికే జిహెచ్ఎంసి అధికారులు సంబంధిత భవనానికి పలుమార్లు నోటీసులు జారీ చేసి, మూడు సార్లు సీజ్ చేసినప్పటికీ నిర్మాణం ఆగలేదని పేర్కొన్నారు. చివరకు ఆ భవనాన్ని ఫంక్షన్ హాల్‌గా మార్చినట్లు వెల్లడించారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసిన వారిని, అలాగే పత్రికల్లో కథనాలు ప్రచురించిన రిపోర్టర్లను బెదిరించడం, తప్పుడు కేసులు నమోదు చేయించడం వంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ విషయమై తాను ఫిర్యాదు చేయడంతో తనపై కూడా తప్పుడు ఆరోపణలు చేసి ఒత్తిడి తెచ్చారని తెలిపారు. బిల్డర్స్ అసోసియేషన్ సభ్యుల వివరాలు, వారు పొందిన అనుమతులు మరియు ప్రస్తుత నిర్మాణాల పరిస్థితిపై సమగ్ర విచారణ జరిపించాలని డీసీపీని కోరారు. అదేవిధంగా కావాలనే తప్పుడు ఫిర్యాదులు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన డీసీపీ, జిహెచ్ఎంసి నుండి అనుమతుల వివరాలు సేకరించి నిర్మాణాల వాస్తవ పరిస్థితిని పరిశీలిస్తామని తెలిపారు. తప్పుడు ఫిర్యాదులు చేసిన వారిపై కూడా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఘనంగా ట్యాంక్‌బండ్ వద్ద డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు

- సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ మార్గం ఆదర్శం: కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



**రంగారెడ్డి, ఏప్రిల్ 14 (నేటి దర్శిని):** భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి 135వ జయంతి ఉత్సవాలు హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు అర్పించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డాక్టర్ అంబేద్కర్ సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గం సమానత్వం, విద్య, స్వాభిమానం అనే విలువలపై ఆధారపడి ఉందని అన్నారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. విద్య ద్వారానే సామాజిక, ఆర్థిక పురోగతి సాధ్యమని పేర్కొన్న కలెక్టర్, యువత అంబేద్కర్ బాటలో నడిచి ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. డాక్టర్ అంబేద్కర్ దూరదృష్టి వల్లే భారతదేశం ప్రజాస్వామ్య, సమానత్వం ఆధారిత దేశంగా అభివృద్ధి చెందిందని తెలిపారు. రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఆచరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి రామరావు, సంఘ సభ్యులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# తుమ్మడం గ్రామంలో రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం

- హెల్మెట్ తప్పనిసరి... ట్రాఫిక్ నియమాలు పాటించాలి: ఎస్సై ఉప్పు సురేష్



**నిడమనూరు, ఏప్రిల్ 14 (నేటి దర్శిని):** నిడమనూరు మండలం తుమ్మడం గ్రామంలో రోడ్డు వారోత్సవాల సందర్భంగా "అరైవ్ అండ్ అలైవ్" అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిడమనూరు ఎస్సై ఉప్పు సురేష్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రోడ్డు భద్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో భాగంగా, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని సూచించారు. ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలని, మైనర్లకు బైకులు ఇవ్వవద్దని హెచ్చరించారు. కార్యక్రమానికి హాజరైన ప్రజలతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్‌లో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

- జాతిని జాగృతం చేసిన అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో గుమ్మడి శ్రీవల్లి



**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 14 (నేటి దర్శిని):** భారత రాజ్యాంగ నిర్మాత, మహానేత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఉత్సాహంగా జరుగుతున్న నేపథ్యంలో, ఈ కార్యక్రమం కూడా విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం స్టేట్ కోఆర్డినేటర్, మహిళా నాయకురాలు గుమ్మడి శ్రీవల్లి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు అర్పించి, ఆయన ఆశయాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, ఉద్యమకారులు, దళిత నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కార్మికులు, సామాన్య ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అంబేద్కర్ చూపిన సామాజిక న్యాయం, సమానత్వం, విద్యా ప్రాధాన్యత వంటి విలువలను అనుసరించాల్సిన అవసరాన్ని పలువురు వక్తలు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలుస్తాయని, సమాజ అభివృద్ధికి అవి ఎంతో అవసరమని కార్యక్రమంలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.


Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, RNI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365